

## సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు సంఘీభావంగా సీజేపీ మార్చ్

**“తిరంగా ఎగురవేయడం నేరం కాదు” నినాదం..**

**కేయూ సర్కిల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ**

హనుమకొండ, అక్టోబర్ 16 (వాయిస్ టుడే):లి సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు సంఘీభావంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వరంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం “లెహ్రా దో తిరంగా” మార్చ్ నిర్వహించారు. వరంగల్‌లోని కేయూ సర్కిల్ వద్ద ప్రారంభమైన ఈ మార్చ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఘటనకు సంబంధించి సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా అరెస్టయిన నేపథ్యంలో వారికి మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మార్చ్ ముగింపులో వాలంటీర్లు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, రాజ్యాంగ విలువల పట్ల తమ నిబద్ధతను చాటారు. “తిరంగా ఎగురవేయడం నేరం కాదు” అనే సందేశంతో పాటు ప్రజాస్వామ్య హక్కులు, భావప్రకటనా స్వేచ్ఛ, సమానత్వం, జాతీయ పతాకం పట్ల గౌరవం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. శాంతియుత ప్రజాస్వామ్య వ్యక్తీకరణకు, భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛలకు కట్టుబడి ఉంటామని వాలంటీర్లు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ ర్యాలీలో సీజేపీ వాలంటీర్లు ప్రజ్వల్ రాజ్, అనుభవ్, తరుణ్, వర్షిత్, రోహణ్ తదితరులు పాల్గొన్నారు.




## సంఘటన్ సృజన్ అభియాన్‌పై సమీక్షలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఇనగాల

**హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకాలపై నివేదిక సమర్పణ**

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 16(వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ‘సంఘటన్ సృజన్ అభియాన్’ (౹ూూ) సమీక్షా సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సచిన్ సావంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. జిల్లాల్లో పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటు పురోగతిపై ఈ సందర్భంగా సమీక్షించారు. సమీక్షలో భాగంగా హనుమకొండ జిల్లాలో మండల, టౌన్, డివిజన్ కమిటీల నియామకాల పురోగతిని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధిష్ఠానానికి వివరించారు. ఇప్పటికే పూర్తయిన కమిటీల వివరాలతో పాటు, ఇంకా పెండింగ్‌లో ఉన్న అధ్యక్షులు, కార్యవర్గాల నియామకాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలు, ఎదురవుతున్న సమస్యలపై నివేదిక సమర్పించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు సంస్థాగత నియామకాలను వేగవంతం చేయడంపై సమావేశంలో చర్చించారు.



## 5,11116 ఐదు లక్షల వెయ్యినూట పదహారు రూ. లతో అమ్మవారి అలంకరణ

**వాసవి క్లబ్ వారిచే సన్మానాలు, గేమ్స్**

ముక్తల్ అక్టోబర్ 16 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ పట్టణంలో వెలిసిన శ్రీ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అంగరంగ వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి అభిషేకము కలశపూజ అనంతరం సాయంత్రము బతుకమ్మ , వాహన సేవలు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పెద్దలకు, వాసవి క్లబ్ సభ్యులకు జ్ఞాపిక అందించి, పట్టణ పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన అతిధులకు సన్మానించుకోవడం జరిగింది. అలాగే చిన్నారులచే ఫ్యాషన్ షో, పెద్దలకు గేమ్స్, దంపతులకు బెలూన్ గేమ్స్ నిర్వహించి ఎంతో ఆహ్లాదంగా కార్యక్రమాన్ని మక్తల్ పట్టణ పరిసర గ్రామాల నుండి విచ్చేసిన వారందరికీ వేదికగా కృతజ్ఞతలు తెలుపుకొని కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, వాసవి క్లబ్ సభ్యులు, భక్తులు, పట్టణ ప్రజలు, తదితరులు, పాల్గొన్నారు.

## యూత్ లిటరరీ ఫెస్ట్‌ని జయప్రదం చేయండి

తెలంగాణ సాహితి. (భద్రాచలం, అక్టోబర్ 16) : తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జరగనున్న యూత్ లిటరరీ ఫెస్ట్ ని జయప్రదం చేయాలని తెలంగాణ సాహితి భద్రాద్రి జిల్లా శాఖ కార్యదర్శి తాతోలు దుర్గా చారి యువ కవులకు, రచయితలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం లో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాహితి ఆద్వర్యం ఓ బుద్ధ వనం నాగార్జునసాగర్ లో ఈ నెల 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు తేదీలలో యువ రచయితలు, కవులతో యూత్ లిటరరీ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు రోజుల ఈ కవితా పండుగ లో యువ కవులు, రచయితలతో కథ, కవిత ప్రక్రియలతో సదస్సు, విశ్లేషణ జరుగుతుందనీ దుర్గా చారి పేర్కొన్నారు. 40 సంవత్సరాల వయస్సు లోపు యువ కవులు, రచయితలు ఈ కార్యక్రమం లో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. ముఖ్యంగా కవిత్వం రాస్తున్న కవులు, రచయితలు ముందుగా వారి వారి కథలు, కవితల ను ముందుగా నిర్వాహకుల కు వాట్సాప్ ( 8897765417) ద్వారా పంపించాలని ఆయన సూచించారు. కొత్తగా ఉత్సాహవంతులైన యువ కవులు, రచయితలు కు ఇది చాలా మంచి అవకాశం అని ఆయన అన్నారు. ఈ అవకాశం ను ఉపయోగించుకుని తమ లోని సాహిత్య ప్రతిభను వెలికితీయాలని దుర్గా చారి కోరారు.



## చిన్నారులకు అక్షరాభ్యాసం

రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ మండలంలోని మహితాపూర్ గ్రామ శివారులోని శ్రీగిరి పర్వతంపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిత్య పూజల అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సరస్వతీ దేవి పూజను పురస్కరించుకుని ఆలయ అర్చకులు జగదీశ్వర్,విశాల్ ఆధ్వర్యంలో 208 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమెడ కావ్యరెడ్డి, కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.



## జి5 టౌన్‌షిప్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**ఆటపాటలతో ఆడపడుచుల సందడి.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ!**

**పందిళ్ళ గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్**

హుస్నాబాద్ వాయిస్ టుడే ప్రతినిధి: హుస్నాబాద్ మండలం పందిళ్ళ గ్రామంలో జి5 టౌన్‌షిప్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు, ఆటల పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా జి5 టౌన్‌షిప్ యాజమాన్యం మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవితాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. అక్కాచెల్లెళ్ల ఆత్మీయతకు, ఆప్యాయతకు, మహిళల ఐక్యతకు బతుకమ్మ పండుగ నిదర్శనమని తెలిపారు. తెలంగాణ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా సంతోషంగా జరుపుకునే అతిపెద్ద పండుగ బతుకమ్మ అని, ఇలాంటి వేడుకల నిర్వహణతో మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని అన్నారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో ముందస్తు బతుకమ్మ సంబరాలు సందడిగా సాగాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పందిళ్ళ గ్రామం ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు యజమాన్యం పందిళ్ళ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన పోచమ్మ వాడ అమ్మవారు

హుస్నాబాద్ వాయిస్ టుడే ప్రతినిధి : పోచమ్మ వాడ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6 వ రోజు శ్రీ సరస్వతి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు ముందు భక్తులు హుస్నాబాద్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బోజు రమాదేవి రవీందర్ ఆధ్వర్యంలో కుంకుమ పూజ దేవి మండపంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గాలి పెళ్లి పద్మ బోజు కనుకవ్వ కేడం సరోజన బోజు సుధారాణి బోజు రాధిక జుల వాణి బోజు అనిత చల్ల పద్మ బూరుగు రజిత బూరుగు స్రవంతి జాల సరిత దండి చందన భక్తులు మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్లను పరిశీలించిన డీఆర్డీఓ జయదేవ్ ఆర్య



హుస్నాబాద్ వాయిస్ టుడే ప్రతినిధి : హుస్నాబాద్ మండలం తోటపల్లి, గాంధీనగర్ ఉమ్మడి గ్రామాల్లో బతుకమ్మ వేడుకల కోసం ఏర్పాటు చేస్తున్న ఘాట్లను సిద్దిపేట జిల్లా డీఆర్డీఓ జయదేవ్ ఆర్య పరిశీలించారు. ఘాట్ల వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసే సమయంలో మహిళలు, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఘాట్ల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల సర్పంచులు పోలు సంపత్, బంక లక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చందు, ఎంపీఓ రమేష్, పంచాయతీరాజ్ ఏఈ రవిచంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ పర్షరాములు గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి భరోసా రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేత

**గ్రామ ఆడబిడ్డ పెళ్లికి సర్పంచ్ ఆర్థిక అండ**

**హుగ్గెల్లీలో పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి తరపున వివాహ కానుక**

జహీరాబాద్. వాయిస్ టుడే ,అక్టోబర్16: గ్రామ ఆడబిడ్డల శుభకార్యాలకు అండగా నిలుస్తూ హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. హుగ్గెల్లీ గ్రామానికి చెందిన అల్గి సుజాత-రాములు కుమార్తె ప్రసన్న వివాహం సందర్భంగా సర్పంచ్ తరపున 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ ఆర్థిక సాయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి,యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు,వార్డు మెంబర్లు బాల్ రాజ్,సలమాన్, గ్రామ సీనియర్ నాయకులు నర్సింహులు,ఇసామోద్దిన్,మశ్చందర్,నర్సింహారెడ్డి,లక్ష్మణ్ యాదవ్, రాములు, రవి, సంజీవ్ మరియు తదితరులు కుటుంబ సభ్యులకు అందజేశారు.తమ కుమార్తె వివాహానికి ఆర్థికంగా అండగా నిలిచిన సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డికి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంతో పాటు గ్రామ ప్రజల శుభకార్యాల్లో సర్పంచ్ అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి

**- ఆరవ వార్డులో అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ విజయ రమణారావు**

**- కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ**

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా అక్టోబర్-16 వాయిస్ టుడే: దుర్గామాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అమ్మవారిని ప్రార్థించారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు సుభాష్ నగర్‌లో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవాల పట్ల ప్రభుత్వ విప్ సంతోషం వ్యక్తం చేశారు. దుర్గామాత



ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ, దసరా నవరాత్రి ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. నిర్వాహకులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. పండుగల సందర్భంగా ప్రజలంతా పరస్పర సహకారంతో, సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని కోరారు.

**మహిళల సమస్యల పరిష్కారానికి సూచనలు**

అనంతరం ఆరవ వార్డుకు చెందిన మహిళలు తమ వార్డులో నెలకొన్న పలు సమస్యలను ప్రభుత్వ విప్ విజయ రమణారావు దృష్టికి తీసుకువచ్చారు. మహిళలు వివరించిన సమస్యలను ఆయన శ్రద్ధగా విన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్‌కు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు నిరంతరం అందుబాటులో ఉండాలని, వార్డు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**